సాక్షి
నిర్మల్
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



ఏసీబీకి చిక్కిన అధికారులు

ఆదిలాబాద్ ఎంప్లాయ్‌మెంట్ శాఖ అధికారులు, రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కారు. మంగళవారం రూ.2.25 లక్షలు లంచం తీసుకుంటుండగా పటుకున్నారు. 10లో▸



ఇళ్లు ఇచ్చే వరకూ కొట్లాడుతాం

పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చే వరకు కొట్లాడుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు భోస్లే మోహన్‌రావుపటేల్ అన్నారు. కుంటాలలో మహాధర్నా నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.2/17.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కౌన్సిలర్లతో మంత్రి మంతనాలు

నిర్మల్: నిర్మల్ మున్సిపాలిటీలో పుట్టిన ముసలంపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెంటనే స్పందించారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి సాగుతున్న ఊహాగానాలకు మంగళవారం సాయంత్రం తెరవేశారు. స్థానిక ఏఎన్ రెడ్డి కాలనీలో క్లబ్‌హౌస్‌లో చైర్మన్ ఈశ్వర్‌వర్గం, ప్రత్యర్థి వర్గంగా పేర్కొంటున్న కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. మీడియాను అనుమతించలేదు. చైర్మన్ ఈశ్వర్‌పై బాహాటంగా సీనియర్ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ చేసిన ఆరోపణలపై మంత్రి సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. మున్సిపల్‌లో అవిశ్వాసం ఉండబోదని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై 'సాక్షి' ఫోన్‌ద్వారా వివరణకు కోరేందుకు ప్రయత్నించగా, మిగతా కౌన్సిలర్లు స్పందించలేదు.

ఆలయాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో రూ.26 లక్షల వ్యయంతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి..

నిర్మల్‌టౌన్: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ పట్టణ శివారులోని చించోలి(బీ)లో ఈద్గా నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 12 ఎకరాల విశాలమైన స్థలంలో, ప్రశాంత వాతావరణంలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేలా ఈద్గా నిర్మిస్తున్నామన్నారు. సుమారు 25 వేల మంది సామూహిక ప్రార్థన చేసుకునేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. రంజాన్ నాటికి పనులు పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషరఫ్ అలీ, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన భైంసా ఏఎస్పీ

భైంసాటౌన్:భైంసా నూతన ఏఎస్పీగా కాంతిలాల్ పాటిల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌తోపాటు పలువురు పట్టణ ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏఎస్పీ మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడివారి గురించితెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. మతపరమైన ఘర్షణలను ప్రోత్సహించొద్దని, అలాంటివారిపై పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు.

గజ్జలమ్మ దీక్ష స్వీకరణ



పూజలు నిర్వహిస్తున్న దీక్షాపరులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. అమ్మవారి సేవ కోసం గ్రామానికి చెందిన 60 మంది మంగళవారం గజ్జలమ్మ దీక్ష స్వీకరించారు. వీరికి గురుస్వామి జక్కని గజేందర్ మాలాధారణ చేశారు. ఆలయంలో దీక్షాపరులు పూజలు నిర్వహించారు.

వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్:రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్ సూచించారు. కెపాసిటర్స్ ఉంటే వోల్టేజీ పెరిగినా మోటార్లపై భారం పడదని పేర్కొన్నారు. మోటార్లు తక్కువ సమయంలో ఎక్కువ నీళ్లు పోస్తాయని తెలిపారు. విద్యుత్ కోతలు తగ్గుతాయని, ఎక్కువ మందికి సరఫరా ఇవ్వొచ్చని వివరించారు. ఆటోమేటిక్ స్టార్టర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని పేర్కొన్నారు.

కలెక్టర్‌గా వరుణ్‌రెడ్డి

- మూడేళ్లు పనిచేసిన ముషరఫ్ అలీ బదిలీ
- నేడు విధుల్లో కొత్త పాలనాధికారి

నిర్మల్: జిల్లా మూడో కలెక్టర్‌గా మూడేళ్లు పనిచేసి తనదైన ముద్రవేసిన ముషరఫ్ అలీ బదిలీ అయ్యారు. ఆయనకు ఇంకా పోస్టింగ్ నిర్ణయించలేదు. నిర్మల్ కొత్త కలెక్టర్‌గా ఉట్నూర్ ఐటీడీఏ పీవో కర్నాటి వరుణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్త కలెక్టర్ బుధవారం ఉదయం 11 గంటలకు బాధ్యతలను స్వీకరించనున్నారు.

జిల్లాకు మరో ఐఐటీయన్..

కొత్త కలెక్టర్‌గా వస్తున్న కర్నాటి వరుణ్‌రెడ్డి సైతం ముషరఫ్ అలీలా ఐఐటీయనే. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఈయన బాంబే ఐఐటీలో చదివారు. 2019 ఐఏఎస్ బ్యాచ్. సివిల్స్‌లో ఆలిండియా 7వ ర్యాంకు సాధించారు. గతేడాది జూన్ 13న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ప్రభుత్వం నియమించింది. పీవోగా ఏడు నెలల 18 రోజుల పాటు బాధ్యతలు నిర్వహించిన వరుణ్‌రెడ్డి గిరిజనాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. అంతకుముందు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా చేశారు. ఐఏఎస్‌కు ముందు 2017లో ఐఆర్ఎస్ సాధించి, ఆదాయపన్ను శాఖలో పనిచేశారు. అనంతరం ఐఏఎస్ సాధించి తెలంగాణ కేడర్ అధికారిగా వచ్చారు. వరుణ్‌రెడ్డి తల్లి నాగమణి వ్యవసాయశాఖలో అడిషనల్ డైరెక్టర్ కాగా, తండ్రి జనార్దన్‌రెడ్డి ప్రముఖ వైద్యుడిగా సేవలందిస్తున్నారు. వరుణ్‌రెడ్డి తన బ్యాచ్‌మేట్ చాహత్ బాజ్‌పాయ్‌ను పెళ్లిచేసుకున్నారు. ఆమె ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్నారు.



కర్నాటి వరుణ్‌రెడ్డి



ముషరఫ్ అలీ

మూడేళ్లలో తనదైన ముద్ర..

జీహెచ్ఎంసీ నుంచి 2020, ఫిబ్రవరి 2న కలెక్టర్‌గా వచ్చిన ముషరఫ్‌అలీ ఫారూఖీ మూడేళ్లు (రెండు రోజులు తక్కువ) జిల్లా పాలనాధికారిగా కొనసాగారు. ఆయన జిల్లాకు రాగానే కోవిడ్ రావడంతో దాంతోనే దాదాపు ఏడాదిన్నర గడిచిపోయింది. కరోనా కట్టడి, ఉపాధ్యాయులు, ఇతర శాఖ ఉద్యోగులు సమయపాలన పాటించేలా తీసుకువచ్చిన 'లైవ్ లొకేషన్'కు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది. పేపర్‌లెస్ కార్యాలయాలుగా చేసేందుకు 'ఈ–ఆఫీస్'లుగా మార్చారు. ఇందులోనూ జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. సిజేరియన్ కాన్పులు నియంత్రించడం, ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెరిగేలా చేయడం, రైతువేదికలు, పల్లెప్రగతి, పట్టణ సుందరీకరణలో జిల్లాకు పేరు తీసుకొచ్చారు. తన పాలనాకాలంలో ఎదురైన భైంసా అల్లర్లను, ట్రిపుల్‌ఐటీ ఆందోళనలను కొలిక్కి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. మున్సిపల్, భూరిజిస్ట్రేషన్ల విషయంలో ఆరోపణలు వచ్చినప్పటికీ పాలన యంత్రాంగాన్ని గాడినపెట్టడంలో సక్సెస్ అయ్యారనే చెప్పవచ్చు. కలెక్టర్‌గా నిర్మల్ తొలి పోస్టింగ్ కావడం సంతోషాన్నిచ్చింది. ఇక్కడ సుదీర్ఘ కాలం పనిచేయడం, నా పనివిధానం చాలా సంతృప్తినిచ్చిందని ముషరఫ్ తెలిపారు.

బీజేపీ ధర్నా.. రచ్చ రచ్చ

- అర్ధరాత్రి టెంట్లు తొలగింపు
- ఉదయం నుంచే నేతల అరెస్ట్
- దూసుకెళ్లిన నాయకులు, కార్యకర్తలు
- బలవంతంగా లాక్కెళ్లిన పోలీసులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నిర్మల్:నిర్మల్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దు చేయాలంటూ మంగళవారం బీజేపీ చేపట్టిన ధర్నా రచ్చగా మారింది. స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం రాత్రి బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన టెంట్లను అర్ధరాత్రి పోలీసులు తొలగించారు. మంగళవారం ఉదయం నుంచే పార్టీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ముఖ్యనేతలు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అంజుకుమార్‌రెడ్డి, అప్పాల గణేశ్‌చక్రవర్తి తదితరులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్మల్‌తోపాటు వివిధ మండలాల నాయకులనూ ముందస్తు అరెస్టు చేశారు.

దూసుకెళ్లిన నాయకులు, కార్యకర్తలు..

శక్తికేంద్రాల సమావేశాల నిమిత్తం ఉదయాన్నే మండలాలకు వెళ్లిన పార్టీ ముఖ్య నాయకులు మెడిసెమ్మె రాజు, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నాయిడి మురళి, శ్రావణ్, సత్యనారాయణ, విజయ్, నారాయణగౌడ్ తదితరులు పోలీసులను తప్పించుకుని ఒక్కసారిగా కలెక్టరేట్ వద్దకు దూసుకు వచ్చారు. మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలంటూ బ్యానర్ పట్టుకుని బైఠాయించారు. పోలీసులు వారిని బలవంతంగా ఎత్తుకెళ్లి, వ్యాన్‌లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఆందోళనకారులను రాణాకు తరలిస్తున్న పోలీసులు

ఆందోళన కొనసాగిస్తాం..

అధికారపార్టీ అండతో పోలీసులు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని, మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దుకోసం తాము చేస్తున్న ఆందోళనలను కొనసాగిస్తామని బీజేపీ నేతలు ప్రకటించారు. పోలీసుస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన బంధువుల స్వలాభం, స్వార్థం కోసం మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదనలు చేశారని ఆరోపించారు. ఈ విషయాలు బయటపడతాయనే బీజేపీ ధర్నాను పోలీసులతో అడ్డుకున్నారని విమర్శించారు. మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను రద్దు చేసేవరకూ పోరాడుతామని స్పష్టంచేశారు.

పండితులకు పదోన్నతి లేనట్టే?

- పీఈటీలదీ అదే పరిస్థితి
- 17 ఏళ్లుగా ఎదురుచూపులు
- ప్రభుత్వ తీరుపై భాషా పండితుల నిరసన
- నేటి నుంచి 8, 9, 10 తరగతులకు విద్యాబోధన బంద్



సమావేశంలో భాషా పండితులు, పీఈటీలు

జిల్లాలో భాషా పండితులు, పీఈటీల వివరాలు..	
తెలుగు పండితులు	110
హిందీ పండితులు	95
ఉర్దూ పండితులు	06
పీఈటీలు	31

నిర్మల్‌రూరల్:ఉపాధ్యాయ పదోన్నతుల్లో భాషా పండితులకు, పీఈటీలకు చోటు దక్కకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పదోన్నతి షెడ్యూల్‌లో తమను చేర్చాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగం పొందిన నాటి నుంచి పదోన్నతి లేకుండా హైస్కూళ్లలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గ్రేడ్–2 ఉద్యోగం సాధించిన 211 మంది భాషాపండితులు, 35 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరంతా 17 ఏళ్లుగా ఎలాంటి పదోన్నతులకు నోచుకోవడం లేదు. ఇప్పటికే చాలామంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందకుండానే రిటైర్ అయ్యారు. తమకు సాక్షాత్తు సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట అమలు కావడం లేదని భాషా పండితులు, పీఈటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఉన్నత' బోధన–'ప్రాథమిక' వేతనం...

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉన్నత పాఠశాలలో కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే బోధించాలి. కానీ రాష్ట్రవ్యాప్తంగా భాషాపండితులు, పీఈటీలకు హైస్కూల్లో పోస్టింగ్ ఇస్తూ, స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా బోధన చేయిస్తున్నారు. అయితే వీరందరికీ లెక్కప్రకారం స్కూల్ అసిస్టెంట్లకు దక్కే వేతనం, ఇతర అలవెన్సులు, పదోన్నతులు మాత్రం దక్కడం లేదు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి స్థాయి జీతభత్యాలు అందుతున్నాయి. పనిచేసేది మాత్రం హైస్కూల్‌లో, జీతం మాత్రం తక్కువగా ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.


నేటి నుంచి బోధన బంద్...

రాష్ట్ర ఐక్యకార్యాచరణ కమిటీ నిర్ణయం మేరకు బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాల్లో 9, 10 తరగతి విద్యార్థులకు బోధన నిలిపివేస్తున్నట్లు భాషాపండితులు, పీఈటీలు ప్రకటించారు. ఈ మేరకు శనివారం డీఈవోలకు, ఆదివారం ఆర్జేడీలకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జాబ్‌చార్ట్ ప్రకారం 6, 7, 8 తరగతి తరగతుల బోధనకు మాత్రమే పరిమితమవుతామని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా పనిచేస్తూ సెకండరీ గ్రేడ్ హోదా వేతనం పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం హామీకే మోక్షం లేదు..

ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం కేసీఆర్ వేదికపైనుంచే భాషా పండితులకు, పీఈటీల పోస్టులను ఉన్నతీకరిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత 2, 3 జీవోలు కూడా విడుదల చేశారు. కేవలం భాషాపండితులు, పీఈటీలకు మాత్రమే స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాలనేది ఈ జీవో సారాంశం. కానీ జీవోలు జారీ చేసి రెండేళ్లు అవుతున్నా అమలు మాత్రం కావడం లేదు. గతంలో రెండుసార్లు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అప్పట్లో భాషాపండితులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం కూడా చేశారు. కానీ ఈ జీవోను సవాలు చేస్తూ ఎస్జీటీలు తాము కూడా పదోన్నతులకు అర్హులమేనని కోర్టుకు ఎక్కారు. దీంతో ఆ జీవో అమలుకు నోచుకోలేదు. స్కూల్ అసిస్టెంట్లతో కూడిన సమాన వేతనం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మంది ఎస్జీటీలకు పోస్టులు ఇస్తామని సీఎం చెప్పినా ఎస్జీటీలు కేసు వాపసు తీసుకోలేదు. దీంతో భాషా పండితులు పదోన్నతులకు నోచుకోలేకపోతున్నారు. ఈసారైనా న్యాయం చేయాలని కోరుతున్నారు.

విద్యాబోధన బంద్..



రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం నుంచి 9, 10 తరగతులకు విద్యా బోధన నిలిపివేస్తున్నాం. దీనికి ప్రధానోపాధ్యాయులు సహకరించాలి. ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం సహకరించాలి.

–గంగాధర్‌రావు, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు

పోషకాహార కిట్ల పంపిణీ

లక్ష్మణచాంద:మండలంలోని వడ్యాల్ రైతు వేదికలో వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ అందించిన పోషకాహార కిట్లను డీఆర్డీవో విజయలక్ష్మి మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 90 మంది బాల, బాలికలకు, 30 మంది బాలింతలకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి విలువైన ఎనిమిది రకాల వస్తువులతో కూడిన పోషకాహార కిట్‌ను అందించారు. ఈ కిట్‌లో 5 కేజీల బియ్యం, కేజీ బెల్లం, కేజీ రాగిపిండి, కేజీ కంది పప్పు, కేజీ పెసర్లు, కేజీ శనగలు, లీటర్ నూనె, అర కిలో పల్లీలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఆరు నెలలు కొనసాగించేందుకు వరల్డ్ విజన్ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. నెలకు రూ.1.20 లక్షల చొప్పున మొత్తం రూ.7.20 లక్షలు ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, సర్పంచ్ లలిత, ఏపీవో ప్రమీల, వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, వడ్యాల్ ఉప సర్పంచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కిట్‌లు పంపిణీ చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

- ప్రత్యేక రైలు కోసం ఏళ్లుగా డిమాండ్
- కొత్త రైలుమార్గం కోసం జిల్లావాసుల ఎదురుచూపు



బాసర రైల్వేస్టేషన్

బాసర డబుల్ లైన్‌కు బడ్జెట్ వచ్చేనా?

భైంసా: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లో అయినా జిల్లాకు కొత్త రైలుమార్గం ప్రకటించాలని జిల్లావాసులు కోరుతున్నారు. కొత్త రైలు కోసం జిల్లా ప్రజాప్రతినిధులు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు ఇస్తూనే ఉన్నారు. కానీ కొత్త రైలు, రైలుమార్గం నిర్మాణంపై ఒక్క అడుగు కూడా ముందుకు పడడంలేదు. ఆర్మూర్ – నిర్మల్ – ఆదిలాబాద్ రైల్వేలైన్ ప్రతిపాదన ముందుకు పడటం లేదు. జిల్లా వాసులు దశాబ్దాలుగా రైలుకూత కోసం ఎదురుచూస్తున్నా అది కలగానే మిగిలి ఉంది.

డబుల్‌లైన్ వచ్చేనా...

దేశంలోని శక్తిపీఠాల్లో బాసర ఒకటి. ఇక్కడ సరస్వతీ అమ్మవారి దర్శనానికి దేశవ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. ప్రయాణానికి రైలు మార్గాన్నే ఎంచుకుంటారు. బాసర వచ్చే భక్తులు ఈ క్షేత్రానికి ప్రత్యేక రైలు నడపాలని ఎన్నో రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఇక బాసర వరకు డబుల్‌లైన్ కోసం యాత్రికులు ఎదురుచూస్తున్నారు. సింగిల్‌లైన్ కారణంగా రైళ్ల క్రాసింగ్‌తో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. వందేభారత్ రైళ్లు పరుగు పెడుతున్న ప్రస్తుత పరిస్థితిలో ప్యాసింజర్ రైలును కూడా ప్రత్యేకంగా బాసర వరకు నడుపడంలేదు. కేంద్రం ఈ బడ్జెట్‌లో అయినా బాసర వరకు డబుల్‌లైన్‌కు నిధులు విడుదల చేయాలని, ప్రత్యేక రైలు నడపాలని జిల్లా వాసులు, యత్రీకులు కోరుతున్నారు.

సర్వే చేస్తామన్న కేంద్రం..

రైల్వేలైన్‌కు 2017లోనే పచ్చజెండా ఊపినా పనులు ప్రారంభం కాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికాలం ఈ అంశంపై ఎలాంటి స్పందన చూపలేదు. మళ్లీ 2018 బడ్జెట్‌లో రైల్వేశాఖకు కేటాయించిన నిధులు, పనుల్లో భాగంగా ఈ మార్గం సర్వేకు కేంద్ర సర్కార్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత కూడా సర్వే చేసిన దాఖలాలు లేవు. రైల్వేలైన్ ప్రక్రియ ప్రారంభం కావాలంటే ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకోవాల్సి ఉంటుందని, ఆ తర్వాతే ఈ లైన్ నిర్మాణ పనుల్లో ముందడుగు పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య అలాంటి ఒప్పందం జరిగిన దాఖలాలులేవు. ఇటీవల ప్రజాసంగ్రామ యాత్రలో బండి సంజయ్ లేవనెత్తే వరకూ కనీసం దీనికి సంబంధించిన అంశంపై ఎక్కడా చర్చ కూడా జరుగకపోవడం గమనార్హం. బుధవారం నాటి బడ్జెట్‌లో అయినా కేంద్రం కొత్త రైలు మార్గానికి నిధులు కేటాయించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సగం భరిస్తామన్న రాష్ట్రం..

జిల్లా మీదుగా ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ వేయాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉంది. పెద్దపల్లి–నిజామాబాద్ లైన్ పూర్తికాకముందు నుంచే నిర్మల్ మీదుగా రైలు వేయాలన్న ప్రతిపాదన ఉంది. 1980–90 నుంచి ప్రతీ రైల్వే బడ్జెట్‌లో కొత్త లైన్, సర్వేలంటూ చెబుతూనే వస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశలు చిగురించాయి. 2017లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, అప్పటి ఎంపీ నగేశ్ రైల్వేలైన్ కోసం కేంద్రానికి విన్నవించారు. రాష్ట్రం సగం వాటా భరిస్తే సిద్ధమని కేంద్రం ప్రకటించింది. ఈనేపథ్యంలో ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ నిర్మాణానికి రాష్ట్రం సగం వాటా భరిస్తుందని సీఎం కేసీఆర్ లేఖ ఇచ్చారు. ఈ లేఖను నాటి రైల్వే మంత్రి సురేశ్‌ప్రభుకు అందించారు. దీంతో కేంద్రం 2017 బడ్జెట్‌లో ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్‌కు పచ్చజెండా ఊపింది.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌టౌన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముషరఫ్ అలీ, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్మల్ డివిజన్ పోలీస్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. కర్తవ్య నిర్వహణలో పోలీసులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమన్నారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి ఒకేరోజు పరీక్షలు చేయడం సాధ్యం కాదని, ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అందరికీ కంటి పరీక్షలు పూర్తయ్యే వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఏఆర్ హెడ్ క్వార్టర్ డ్రైవర్లు, పోలీస్ కార్యాలయ, నిర్మల్ డివిజన్, ఏఆర్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు ఎస్పీ(ఏఆర్)వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దృష్టిలోపాలకు చికిత్స

మామడ:గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న కంటివెలుగు శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ధనరాజ్ సూచించారు. మండలంలోని జగదాంబతండాలో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్యశిబిరాన్ని మంగళవారం సందర్శించారు. శిబిరానికి వచ్చిన వారికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో కంటివెలుగు శిబిరానికి అర్హులైన వారిని గుర్తించామని చికిత్స చేయించుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి అద్దాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గోవర్ధన్, ఎంపీవో లక్ష్మన్న, సూపర్‌వైజర్ కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి మంగేశ్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మన ఊరు.. మనబడి సిద్ధం

- నేడు ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు

నిర్మల్‌చైన్‌గేట్:ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మన ఊరు, మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో జిల్లాలో 260 పాఠశాలలను ఎంపిక చేశారు. పనులు పూర్తయిన పాఠశాలలను బుధవారం ప్రారంభించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ముషరఫ్ అలీ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాలుగు మోడల్ పాఠశాలలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో నిర్మల్ రూరల్ మండలంలోని ఎల్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భైంసా ఒవైసీ నగర్‌లోని మండల పరిషత్ పాఠశాలను, కుభీర్ మండలం కస్రా ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తారని వివరించారు. ఇక ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలం చింతలపేట ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే రేఖానాయక్ ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్లోరింగ్, ఫాల్ సీలింగ్, హ్యాండ్ వాష్, సంప్, టైల్స్, డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్ చాక్ బోర్డులు, డిజిటల్ పరికరాలు, ప్రహరీ, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ వంటి మొత్తం 12 పనులు పూర్తిచేసినట్లు వివరించారు.

క్లుప్తంగా

బావిలో పడి వివాహిత మృతి


సాబ్లే పద్మ (ఫైల్)

ఇంద్రవెల్లి: బావిలో పడి వివాహిత మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని అందు నాయక్‌తాండ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై సునీల్ వివరాల ప్రకారం... అందునాయక్‌తాండ గ్రామానికి చెందిన సాబ్లే పద్మ(30) భర్తతో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండేది. అయితే పద్మ కొన్నిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పద్మ వ్యవసాయ చేనులోని బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తల్లి కమలబాయి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పద్మకు భర్త పరమేశ్వర్, ఇద్దరు కుమారులు శాసంక్(6), సందీప్(4) ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

అనారోగ్యంతో కళాకారుడు మృతి


మహిళా వేషధారణలో నారాయణ (ఫైల్)

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన కళాకారుడు కస కాపూర్ నారాయణ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. నారాయణ తెలంగాణ ఉద్యమంలో తన పాటలు, నటన, నృత్యాలతో ప్రజల దృష్టిని ఉద్యమం వైపు మళ్లించారు. ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొని మహిళా వేషధారణలో అలరించారు. గ్రామంలో నిర్వహించిన అమరణ నిరాహార దీక్షా శిబిరం నిర్వహించి కార్యక్రమాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. ఆయన మృతిపై శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు సంతాపం ప్రకటించారు.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ ఫోక్సో కోర్టు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం.పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2017 డిసెంబర్ 1న బేల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తన స్నేహితుల వద్దకు వెళ్తుంటే హస్నాపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్ కిడ్నాప్ చేసి మహారాష్ట్రలోని పూణెకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబీకులు గాలించి ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నరేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ రమణారెడ్డి 13మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

లాభాల సాగు...బ్రోకోలి


ఇచ్చోడ మండలంలోని దాబాకె గ్రామంలో సాగవుతున్న బ్రోకోలి

- అర ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి
- లాభాలు వస్తున్నాయంటున్న రైతులు

ఇచ్చోడ: అన్నదాతలు లాభాల వచ్చే కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. బ్రోకోలి సాగుతో లాభాలు గడిస్తున్నారు జిల్లాలోని రైతులు. మూడేళ్ల కిందట జిల్లాలో కొంత మంది రైతులు బ్రోకోలి పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో కూరగాయలు సాగుచేసే రైతులు బ్రోకోలిని ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ పంటలో అనేక ఔషధ గుణాలు సైతం అధికంగా ఉన్నాయి. దీనికి ధర సైతం ఎక్కువగానే ఉంటుంది. దీనికి కిలో బ్రోకోలికి రూ.70 నుంచి 80 పలుకుతుంది. మూడేళ్ల కిందట ఈ పంటను జిల్లాలోని పొన్నారి, అంకోలి, బేల తదితర ప్రాంతాల్లో సాగుచేశారు. ఈ ఏడాది ఇచ్చోడ మండలంలోని దాబాకె గ్రామంలో రాథోడ్ గణేశ్ అనే రైతు పాలీహౌస్‌లో అర ఎకరంలో సాగు చేశాడు.

ఔషధ గుణాలు బాగు...

చూడడానికి కాలీఫ్లవర్ లాగా కనిపించే పువ్వు జాతి కూరల్లో బ్రోకోలి ఒకటి. అత్యంత ఆరోగ్యవంతమైన కూరగాయల్లో దీనికి అధిక ప్రాధాన్యం ఉంది. అనేక పోషక విలువలతో పాటు విటమిన్ బీ, సీ, ఈలు కలిగి ఉండి యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. బ్రోకోలి బ్లడ్‌లోని షుగర్‌ను క్రమబద్ధీకరించే గుణాలు కూడా అధికంగా ఉంటాయని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

విత్తనం ధర కూడా ఎక్కువే...

బ్రోకోలి విత్తన ధర ఎక్కువే. బ్రోకోలి పది గ్రాముల విత్తన ప్యాకెట్‌లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. దీని పది గ్రాముల విత్తనం ప్యాకెట్ ధర రూ.650 వరకు పలుకుతోంది. అర ఎకరంలో బ్రోకోలి సాగుకు కనీసం 15 నుంచి 18 ప్యాకెట్లు అవసరమని, ఎకరం విత్తనాలకు రూ.10వేల నుంచి 12 వరకు, మూడు నెలల పాటు సాగుకు అయ్యే ఖర్చు మరో రూ.15వేల వరకు మొత్తం దాదాపుగా రూ.30వేల వరకు ఖర్చు అవుతున్నట్లు సాగు చేస్తున్న రైతులు చెబుతున్నారు.

లాభాలు వచ్చాయి...



అర ఎకరంలో బ్రోకోలిని సాగు చేశాను. 20నుంచి 25క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. రూ.5వేలకు క్వింటాల్ చొప్పున హైదరాబాద్‌లో విక్రయించాను. పంటపై పెట్టిన ఖర్చులు పోను దాదాపుగా రూ.లక్ష వరకు లాభం వచ్చింది.

– రాథోడ్ గణేష్, దాబా(కె) బ్రోకోలి సాగుచేస్తున్న రైతు

సాగుతో మేలు...



గతంలో జిల్లాలో కొంత మంది రైతులు బ్రోకోలి పంటను సాగు చేశారు. ఈ పంటలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నప్పటికీ ఇక్కడి మార్కెట్లో బ్రోకోలికి ఆశించిన స్థాయిలో ధరలు రాక పోవడంతో రైతులు సాగుకు ముందుకు రావడం లేదు. సాగు చేసిన పంటలను పట్టణ ప్రాంతాల్లో విక్రయించి లాభాలు పొందవచ్చు.

– మహేశ్, ఉద్యానవనశాఖ అధికారి

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

- ఘనంగా కళాశాల వార్షికోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు


మాట్లాడుతున్న డీఐఈఓ రవీంద్ర కుమార్

నేరడిగొండ: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని డీఐఈవో రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్పోర్ట్స్ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణించి తల్లిదండ్రులు, గురువుల పేరును నిలబెట్టాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మైమరిపించాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కేరింతలతో కళాశాల ఆవరణం దద్దరిల్లిపోయింది. అలాగే కళాశాలలో సొంత ఖర్చుతో మధ్యాహ్న భోజనం కొనసాగిస్తున్న లెక్చరర్ బలరాం జాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాదవ్ గణేష్, సుదర్శన్, బోథ్, నేరడిగొండ కళాశాలల ప్రిన్సిపాళ్లు, శంకర్, శబాన తరన్నం, లెక్చరర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ

కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామంలో వచ్చే నెల 2నుంచి రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంబాల రాజేశ్, హనుమంతరావు ఓ ప్రకటనలో తెలిపారు.ఈటోర్నమెంట్‌లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. వివరాలకు 9347319628 నంబర్‌లో సంప్రదించాలని, క్రీడాకా రులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్రస్థాయి వాలీ బాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఏజెన్సీలో బెల్ట్‌షాపులు తొలగించాలి

- ఐటీడీఏ పీవోకు వినతి


పీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యకు దూరం అవుతున్నారని, ఏజెన్సీలోని బెల్ట్ షాపులను తొలగించాలని మంగళవారం రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందోర్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకునే సమయంలో మద్యం మత్తులో యువత చెడు అలవాట్లకు గురై రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకునే సమయంలో మద్యానికి బానిసలవుతున్నారన్నారు. దీంతో తల్లిదండ్రులకు ఎనలేని దుఖాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత ఏజెన్సీ ప్రాంత మనుగడ యువతపై ఆధారపడి ఉందని ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలోని బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు.

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్

బేల: కోర్ట చనకా రిజర్వాయర్ భూసేకరణలో రైతులకు అన్యాయం చేసినా, బెదిరించినా ఊరుకోమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో రూ.350కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రారంభమైన కోర్ట చనకా బ్యారేజీ ప్రస్తుతం రూ.750 కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 2016లో ఎకరాకు రూ.10లక్షల చొప్పున నష్ట పరిహారం ఇచ్చి రైతుల భూములు తీసుకున్నారని తెలిపారు. కానీ ప్రస్తుతం ఎనిమిదేళ్ల తర్వాత ఈ బ్యారేజీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా నిర్మించనున్న డిస్ట్రిబ్యూషన్ కాలువ భూసేకరణ కోసం రూ.6లక్షలు, రూ.7లక్షల చొప్పున ఇస్తామనడం ఏమిటని మండిపడ్డారు. ఇచ్చేంది తీసుకోవాలని, లేదంటే భూములు బలవంతంగా లాక్కుంటామని అధికారులు బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ బెదిరించడం వెనుక బీఆర్ఎస్ కమీషన్ల నాయకులు ఉన్నట్లు తెలుస్తుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, సర్పంచ్ రాకేష్, నాయకులు తాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేష్, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

కత్తితో హల్‌చల్


తుకారాంను పట్టుకున్న పోలీసులు

బోథ్: మండల పరిషత్ బాలికల పాఠశాలలో ఓ వ్యక్తి మధ్యాహ్న బిల్లుల కోసం కత్తితో హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుకారం కుమారుడు సుభాష్ మధ్యాహ్న భోజన కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా గత కొంతకాలంగా బిల్లులు రావడం లేదు. బియ్యం మినహా తొమ్మిది రకాల వస్తువులు తామే పెడుతున్నామని బిల్లులు రావడం లేదని వాపోయాడు. కూరగాయలు కోసే కత్తితో హల్‌చల్ చేశాడు. తమకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశాడు. తాము పేదవారమని బిల్లులు చెల్లించకుండా ఉంటే ఎలా బతకాలని వాపోయాడు. ప్రధానోపాధ్యాయులు అస్గర్ ఉన్నీసా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగప్రవేశం చేసి తుకారాంను అదుపులోకి తీసుకున్నారు. బిల్లులు వారి అకౌంట్లలోనే పడుతాయని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- కాలిబూడిదైన పెళ్లి సామగ్రి


అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి, ఇల్లు

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామానికి చెందిన ఉద్గిరి రాందాస్ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైంది. ఉద్గిరి రాందాస్ తన భార్యతో కలిసి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. చుట్టు పక్కల వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం కానరాలేదు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఉద్గిరి రాందాస్ కూతురు పెళ్లి నిశ్చయమైంది. దీంతో పెళ్లి కోసం సామగ్రిని తీసుకువచ్చి ఇంట్లో ఉంచారు. అగ్నిప్రమాదంలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి మూడు రోజుల సాధారణ జైలు, 39 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఇందులో ఇద్దరికి సాధారణ జైలు, 39మందికి రూ.53,300 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రెహమాన్ తీర్పునిచ్చారు. అలాగే వారం క్రితం పట్టుబడిన 43 మందిని సైతం కోర్టులో హాజరు పరుచగా రూ.45200 జరిమానా, ఇద్దరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి అజీజ్ రహెమాన్ తీర్పునిచ్చినట్లు కోర్టు లైజెన్ అధికారి సక్రియ నాయక్ తెలిపారు.

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ కుటుంబ సభ్యులు


పూజలు చేస్తున్న ఎస్పీ కుటుంబ సభ్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సతీమణి అరుణతో పాటు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. నాగోబా ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. మెస్రం వంశీయులు పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సునీల్, మాజీ సర్పంచ్ నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు రాజు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తున్న రాజు ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాజు ఇచ్చోడ నుంచి పొచ్చెర గ్రామానికి బంధువుల ఇంటికి వస్తున్నాడు. గ్రామ సమీపంలో నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాజును స్థానికులు బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

తల్లిని హతమార్చిన కొడుకుకు జీవిత ఖైదు

కాగజ్‌నగర్‌టౌన్: తల్లిని హతమార్చిన కొడుకుకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ జడ్జి డీ రవీంద్రశర్మ తీర్పు చెప్పారు. లైజన్ ఆఫీసర్ సిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 21న తాడూరి ప్రశాంత్ తనకు పెండ్లి చేయడం లేదని తల్లి సంధ్యారాణి (52)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. సంధ్యారాణికి కడుపు, మెడపై తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారం తర్వాత మృతి చెందింది. అప్పటి సీఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ జీఎస్ ప్రసాద్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా ఈ మేరకు జడ్జి పైతీర్పు ఇచ్చినట్లు వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూర్: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నాగుల్వాయి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. నాగుల్వాయి గ్రామానికి చెందిన మోర్లె బిజ్జు మేర (74) జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: మున్సిపాల్టీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయణ ఇంటిలో చోరీ జరిగినట్లు స్థానిక సెకండ్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం దొంగలు తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. బీరువాలోని రూ.10వేల నగదు, నగలు ఎత్తుకెళ్లారు.

మనుబోతుకు గాయాలు


చికిత్సకు తరలిస్తున్న బేస్ క్యాంపు సిబ్బంది

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ వద్ద ఓ మనుబోతు పిల్ల తీవ్రంగా గాయపడింది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం... మచ్చాపూర్ శివారు ప్రాంతం నుంచి బెదిరిపోయి వచ్చిన ఈ మనుబోతు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ వద్ద కంచెను దాటి వచ్చింది. ఈ క్రమంలో హైవే రేయిలింగ్‌తో పాటు కంచె తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కామధేను గోశాల వ్యవస్థాపకుడు అర్యన్ మహారాజ్, స్థానిక జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, స్థానికులు పటుకుని పశువైద్యులను పిలిపించి చికిత్స అందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. భరంపూర్ బేస్ క్యాంపునకు చెందిన సిబ్బంది జీవన్, జ్ఞానేశ్వర్, రాజేష్‌లు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఇచ్చోడకు తరలించారు.

జాతీయస్థాయి పోటీల్లో బాల కేంద్రం చిన్నారులు


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న బాల కేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని వార్ధాలో నిర్మల మల్టీపర్పస్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 29, 30 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫస్ట్ నేషనల్ డ్యాన్స్ కాంటెస్ట్‌లో ఆదిలాబాద్ బాలకేంద్రం చిన్నారులు పాల్గొన్నారు. 11 మంది చిన్నారులు కూచిపూడి నృత్య విభాగంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొని నృత్యాలు చేశారు. మైనర్ విభాగంలో కొంకటి దీక్ష, ఠాగూర్ హర్షిని, సబ్ జూనియర్ విభాగంలో గుండేటి అశ్విత, గడ్డం శ్రీనిధి, దువాస హర్షిని, చిరాపురం స్వరాత్మిక, సన్నిధి దేశ్ ముఖ్, జాబు శ్రీ వర్దిని, జూనియర్ విభాగంలో పన్నాల లాస్య, సమ మహతి, చిలుక ఆమనిలు ప్రాతినిధ్యం వహించినట్లు బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలియజేశారు.

జాతరను విజయవంతం చేసిన అధికారులు

- నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ తుకారాం

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద గిరిజన 2వ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతరను విజయవంతం చేసిన అధికారులకు, ప్రజలకు ఆలయ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు. నాగోబా ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 21 నుంచి 28 వరకు కొనసాగిన నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్నీ ఏర్పాట్లు చేసి జాతర విజయవంతం కావడానికి సహకరించిన కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవోలతో పాటు అధికారులు, పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా జాతరకు వచ్చిన వ్యాపారస్తులు, వివిధ రాష్ట్రాలతో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాగోబా ఆలయ పూజారి మెస్రం శేక్ పాల్గొన్నారు.

పాఠశాలలో ట్రెయినీ కలెక్టర్ విచారణ


విచారణ చేపడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

బోథ్: మండల కేంద్రంలో మండల పరిషత్ బాలికల పాఠశాలలో ట్రెయినీ కలెక్టర్ శ్రీజ మంగళవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో సల్ల రవి అనే వ్యక్తి పాఠశాలలో అభివృద్ధి పనులు చేశారు. ఈ పనులకు సంబంధించిన బిల్లు రావడం లేదని ఇటీవల కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫిర్యాదు చేశాడు. సంబంధిత ఇంజినీర్ ఎంబీ రికార్డు చేసినా బిల్లులు చెల్లించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ట్రెయినీ కలెక్టర్ శ్రీజను విచారణ కోసం పాఠశాలకు పంపించారు. సర్పంచ్ సురేందర్‌తో పాటు ఎంఈవో భూమారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అస్గర్ ఉన్నీసా బేగంలను విచారించారు. రూ.4లక్షల పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే కాంట్రాక్టర్ రవికి అందించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు అందడం లేదని తుకారం అనే వ్యక్తి కత్తితో హల్‌చల్ చేసిన ఉదంతంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడెం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కల్లెడ గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. గంట లచ్చన్న (52) భార్య శాంత మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి లచ్చన్న మానసికంగా కుంగిపోయాడు. సోమవారం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొనస రాజు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు